తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

19-06-2026

శుక్రవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 131

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575

# ఆ డైరీలో ఏముంది?!

- ల్యాండ్స్ అండ్ సర్వే నరహరి వెనుక కోట్ల రియల్ దందా..
- ఏసీబీ చేతికి చిక్కిన అక్రమార్కుల చిట్టా?
- ఏసీబీ సోదాల్లో దొరికిన రహస్య డైరీ
- రెండు వందల కోట్ల నిర్మాణ ప్రాజెక్ట్ వివరాలు
- భాగస్వాములుగా ఉన్న సర్వే శాఖ అధికారులు
- కొందరు పదవీ విరమణ.. మరికొందరు సర్వీసులోనే..
- బినామీల పేర్లతో సహా డైరీలో రాసిన నరహరి
- తవ్వేకొద్దీ బయటపడుతున్న అవినీతి తిమింగలాలు
- పేర్లు బయటకు రాకుండా నేతకు రూ.20 కోట్ల ఆఫర్?



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో గత రెండేళ్లుగా పట్టుబడుతున్న అవినీతి అధికారుల్లో ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా అక్రమ ఆస్తులను కూడబెడుతున్నారు. లంచాల రూపంలో వచ్చిన సంపాదనను రెట్టింపు చేసుకోవడం కోసం చాలా మంది అధికారులు రియల్ ఎస్టేట్ దందాలను ఎంచుకుంటున్నారు. తాజాగా ఏసీబీ అధికారులకు చిక్కిన ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి కూడా ఇదే బాటలో పయనించారు. అయితే ఆయన తన సంపాదన వివరాలు, ఆస్తులను ఎక్కడెక్కడ కూడబెట్టారనే మొత్తం సమాచారాన్ని ఒకే చోట ఒక రహస్య

మిగతా 2వ పేజీలో..



# ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

- పేదల జోలికి వెళ్లకుండా.. కబ్జాదారుల భరతం పడుతోంది
- హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం
- ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది
- మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం
- మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి, జూన్ 18:**

ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు

మిగతా 2వ పేజీలో..



## వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

- 30న రైతు భరోసా నిధులు విడుదల
- మధిర వేదికగా సిఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

2

## మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో మహిళా శక్తి క్యాంటీన్ పరిశీలన



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణలోని మహిళల స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మింట్ కాంపౌండ్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సందర్శించి పరిశీలించారు. క్యాంటీన్

మిగతా 2వ పేజీలో..



## పరిశ్రమల అభివృద్ధికి టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ తోడ్పాటు అభినందనీయం

3

- మూడు నెలలుగా నిరంతర సమీక్షలతో వేగవంతమైన సేవలు ..పారిశ్రామికవేత్తలకు అయన సహకారం మరువలేదని
- ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు గరిమెళ్ల శ్రీనివాస్.. హైదరాబాద్ రెడ్ హిల్స్‌లో పారిశ్రామికవేత్తల విస్తృత స్థాయి సమావేశం

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించండి

- యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల ప్రైవేటీకరణను ఆపాలి
- పాత పెన్షన్ విధానం అమలు చేయాలి..
- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలి..
- సాధారణ బదిలీలు చేపట్టాలి
- ట్రాన్స్‌కో సీఎండీకి టీజీపీఈ జాక్ నేతల విజ్ఞప్తి
- విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కో సీఎండీని కలిసిన సంఘం ప్రతినిధులు

**తెలంగాణా బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణలోని విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం విద్యుత్ సౌధా లో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాక్ నేతలు ట్రాన్స్కో సీఎండీ కృష భాస్కర్ ను కలిసి విన్నవించారు. విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా అయన దృష్టికి తెచ్చారు. తెలంగాణ





## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- 11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం
- జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం

3



## అవినీతిపై ప్రశ్నిస్తే ఎదురుదాడులా?

- సమాధానం చెప్పకుండా తప్పించుకోలేరు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై కొప్పుల ఫైర్

2



## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

- సునీల్ కుమార్ బెయిల్ పిటిషన్ విచారణ
- ఎప్పటిలోగా లొంగిపోతారో చెప్పాలన్న హైకోర్టు
- విచారణ నేటికి వాయిదా వేసిన కోర్టు

**అమరావతి, జూన్ 18 సిరి న్యూస్:**

ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ సభ్యుడిపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఐపీఎస్ అధికారికి ముందస్తు బెయిల్ రక్షణగా మారకూడదని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పిటిషనర్‌ను

మిగతా 3వ పేజీలో..

## రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

- అందులో 5 ఎకరాలు తమవేనంటూ ఎస్‌బిఐ పిటిషన్
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు

**హైదరాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**

హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర

మిగతా 2వ పేజీలో..






## పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు

- ఎంతటి వారైనా పార్టీకి కట్టుబడి ఉండాల్సిందే
- క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి

2



## సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

- కేసముద్రం మార్కెట్లో పెరిగిన కొనుగోళ్లు

2

# అవినీతిపై ప్రశ్నిస్తే ఎదురుదాడులా?

**కరీంనగర్, జూన్ 18:**

ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఈ విషయాలపై సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లు మాయమయ్యాయన్న అంశం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగా ధైర్యం ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. మంత్రి పదవికి రాజీనామా చేయడం అంత సులభమైన విషయం కాదని, ఎన్నో కష్టాలు పడి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసే ధైర్యమే లేదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలపై సమాధానాలు చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. హరీశ్‌రావును 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ రాజకీయాలు చేస్తున్నావా? అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హాయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆరఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆరఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. తెలంగాణ బాగుండాలంటే బీఆరఎస్ మళ్లీ గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు.

# రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

**మొదటిపేజీ తరువాయి**

ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి ఇటీవల వేలం నిర్వహించారు. ఈ స్థలాన్ని ఎకరాకు రూ.237కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక్ ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. సర్వే నెంబర్ 83/1లోని 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాయదుర్గం భూముల వేలంపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలోని పన్మక్తలో టీజీఐఐసీ జరిపిన భూముల వేలంపై ఇటీవల ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. ఇటీవల జరిగిన వేలంలో అక్కడ ఎకరం రూ.237 కోట్లు పలికిన సంగతి తెలిసందే. సర్వే నం.83/1లో ఐదు ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. మే 6న జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌తోపాటు తదనంతరం జరిగిన భూ విక్రయాన్ని, తమ వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ మే 20న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఎస్‌బీఐ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. రాయదుర్గంలో ఎస్‌బీహెచ్‌కు 2010లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఇందుకోసం రూ.13.33 కోట్లను చెల్లించింది. ఎస్‌బీఐలో ఎస్‌బీహెచ్ విలీనం కాగా, గతంలో ఈ స్థలంలో ఉన్న రెండు ఏటీఎంలను ఎస్‌బీఐ నిర్వహిస్తోంది. 2020లో గత ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయగా ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ.. ఎస్‌బీఐ అభ్యర్థనను పునఃపరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం 2024లో ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ కేటాయింపును రద్దు చేయడంతో ఎస్‌బీఐ మరోసారి హైకోర్టును ఆశ్రయించింది.

# పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు


**హైదరాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**

ఎంతటి వారైనా సరే వారి వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్ద వద్దని నేతలకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. వి□కు ఏమైనా సమస్యలు ఉంటే.. వాటిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేకుంటే రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు వి□నాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని నేతలకు ఆయన సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరవుతారన్నారు. కామారెడ్డిలో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు. షబ్బీర్ ఆలీకి నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆదివారం కమిటీ ముందు హాజరు కావాలని ఆయనకు సూచించామన్నారు. అందుకు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముందుగా షబ్బీర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదుపై క్రమశిక్షణ కమిటీ చర్చిందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని మల్లు రవి వెల్లడించారు. పార్టీ వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించిన క్రమశిక్షణ కమిటీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని నేతలకు ఎంపీ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. పార్టీ క్రమశిక్షణ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కలిసి అన్ని విషయాలు వివరించానని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. నోటీసులపై లిఖిత పూర్వక సమాధానం ఇచ్చానన్నారు. అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆయన్ని కోరినట్లు చెప్పారు. వారం రోజుల్లో అన్ని అంశాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి తెలిపారని చెప్పారు. కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారని వివరించారు.

# సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

**మహబుబాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**

సన్న ధాన్యానికి మద్దతు పెరుగుతోంది. మార్కెట్లలో మద్దతు ధరలను మించి ధరలు పెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈయేడు సరిగా పంటలు పండకపోతే ధరలు పెరుగుతాయన్న భావనలో వ్యాపారులు ఉన్నారు. మహబుబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ధాన్యం ధర ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.2,906 నమోదైంది. గత 15 రోజులుగా ఈ మార్కెట్‌లో ఆరఎనఆర్ రకం వడ్లరేట్ రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక మార్కెట్‌కు ఈ `వేలం'లో క్వింటాకు గరిష్ఠంగా రూ.2,906, కనిష్ఠంగా రూ.2,226, సగటున రూ.2,589 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,389 ఉండగా, ఈ సీజన్‌లో అంతకంటే ఎక్కువగానే మార్కెట్లో ధరలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉంటాయనే కారణాలతో వ్యాపారులు నిల్వ చేసేందుకు మార్కెట్లో ధాన్యం ఖరీదులు పెంచారు. ఈ క్రమంలో దేశీయంగా ధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో మార్కెట్లో ఈ సీజన్‌లో గత 15 రోజులుగా ధాన్యం సగటు ధర పెరుగుతూ వస్తోంది. ఈ నెల 1న ధాన్యం సగటు ధర రూ.2,475 నుంచి రూ.2,495 వరకు ఉన్నాయి. ఆ తర్వాత ఈనెల 4న సగటు ధర రూ.2, 589, 5న రూ.2636, 8న రూ.2,689, 9న రూ.2,729గా నమోదయ్యాయి. తాజా గా గరిష్ఠ ధర రూ.2,900 మార్కు దాటడం విశేషం.



# ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

**మొదటిపేజీ తరువాయి**

చూపెడుతున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమి చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# ఆ డైరీలో ఏముంది?!

**మొదటిపేజీ తరువాయి**

డైరీలో రాసి పెట్టడం ఇప్పుడు సంచలనంగా మారింది. నెలకు లక్షల్లో జీతం తీసుకునే ప్రభుత్వ అధికారుల సంపాదన కోట్లల్లో ఎలా ఉంటుందో ఆధారాలతో సహా చూపించేలా ఈ డైరీ ఇప్పుడు ఏసీబీ అధికారుల చేతికి చిక్కింది.

ఆ డైరీలో ఏముంది?.. రెండు వందల కోట్ల ప్రాజెక్ట్ నరహరి నివాసాలపై జరిగిన ఏసీబీ దాడుల్లో దొరికిన కోటి పదిహేను లక్షల రూపాయల నగదు, బంగారం, ఆస్తుల పత్రాలు ఒక ఎత్తయితే.. సదరు డైరీలో లభ్యమైన సమాచారం అంతకు పది రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ డైరీ ఆధారంగా నరహరి తన సొంత శాఖలోనే పనిచేస్తున్న మరికొంతమంది అధికారులతో కలిసి అక్షరాలా రెండు వందల కోట్ల రూపాయల వ్యయంతో ఒక భారీ కన్స్ట్రక్షన్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్ లోని చిక్కడపల్లి కేంద్రంగా నడుస్తున్న ఈ నిర్మాణ సంస్థలో మొత్తం పన్నెండు మంది భాగస్వాములు ఉండగా, వారంతా ల్యాండ్స్ అండ్ సర్వే శాఖకు చెందిన వారే కావడం గమనార్హం. వీరిలో ఎక్కువ మంది ఇప్పటికే పదవీ విరమణ పొందిన వారు కాగా, కొందరు మాత్రం ఇంకా సర్వీసులోనే కొనసాగుతున్నారు. అయితే డైరీ రాసే సమయంలో నరహరి ప్రతి ఒక్క అసలు భాగస్వామి పేరు, వారి బినామీల పేర్లు, ఎవరి వాటా ఎంతో స్పష్టంగా వివరాలు నమోదు చేయడం ఇప్పుడు మిగతా అధికారులకు పెద్ద ముప్పు తెచ్చిపెట్టింది. నరహరి అక్రమాస్తుల కేసు మూలంగా కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టిన మిగతా భాగస్వాములంతా ప్రస్తుతం తీవ్ర భయాందోళనల్లో గడుపుతున్నారు.

**పేర్లు దాచేందుకు రూ. 20 కోట్ల ఆఫర్**

నరహరి రాసిన డైరీలో పన్నెండు మంది అధికారుల పేర్లు, వారి పెట్టుబడుల వివరాలు స్పష్టంగా ఉండటంతో.. ఏసీబీ అధికారులు ఎక్కడ తమను విచారిస్తారో అనే భయం ఆ అధికారులలో మొదలైంది. ఈ క్రమంలోనే తమ పేర్లు బయటకు రాకుండా కేసు నుండి తప్పించుకునేందుకు సదరు అధికారులు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక కీలక నేతను సంప్రదించినట్లు సమాచారం. తమ పేర్లు ఏసీబీ రికార్డుల్లోకి ఎక్కకుండా చూస్తే ఏకంగా ఇరవై కోట్ల రూపాయలు ఇస్తామని సదరు నేతకు ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే ఆయా అధికారుల వెనుక ఏ స్థాయి అవినీతి సామ్రాజ్యం దాగి ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ వ్యవహారంపై సదరు కాంగ్రెస్ నేత మాత్రం సమస్య తీవ్రత దృష్ట్యా తానేమీ చేయలేనని, చేతులెత్తేసినట్లు సమాచారం. ప్రభుత్వ లెక్కల ప్రకారం పట్టుబడిన అధికారిక ఆస్తి విలువ ఐదు కోట్ల పది లక్షల రూపాయలగా ఉన్నప్పటికీ, మార్కెట్ విలువ ప్రకారం అది వందల కోట్లలోనే ఉంటుంది. ఒక్క అధికారి వెనుకే రెండు వందల కోట్ల రూపాయల ప్రాజెక్ట్ నడుస్తోందంటే, వ్యవస్థలో అవినీతి ఎంతగా పాతుకుపోయిందో అర్థమవుతోంది. కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించిన అధికారులు ఏసీబీకి దొరకడం, ఆపై వారి అక్రమ వ్యాపారాలు ఇలా బయటపడటం రాష్ట్రంలో నిత్యకృత్యంగా మారింది.



# మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటుకు అయిన మొత్తం ఖర్చు, అక్కడ ఉద్యోగులకు కల్పించిన వివిధ రకాల వసతులు, మౌలిక సౌకర్యాల గురించి ఆ సంస్థ సీఎండీ జితేష్ వి పాటిల్‌ను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన, ఉద్యోగులకు పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ క్యాంటీన్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి.. ఉద్యోగులకు, సందర్శకులకు ఎల్లప్పుడూ సరసమైన ధరలకే నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అనంతరం క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన మెనూ బోర్డును, ధరల పట్టికను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు డైరెక్టర్ కమర్షియల్ చక్రపాణి, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ఐటి శివాజీ, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్.నరసింహ, డైరెక్టర్ ఫైనాన్సు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించండి

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టీసియన్లు , పెన్షనర్లకు సంబంధించిన వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.



ఉద్యోగులు, ఆర్టిసియన్లు, పెన్షనర్లకు వేతన సవరణ మరియు అలవెన్సుల అమలు చేయాలని, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ మరియు హాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ఓఅండ్ఎం పనుల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవవాలని వారు సీఎండీకి విజ్ఞప్తి చేశారు. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.1999 నుంచి 2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు జీపీఎఫ్ మరియు పెన్షన్ సౌకర్యాల కల్పన, మహారాష్ట్ర నమూనాలో రైతు డిస్కం ఏర్పాటు అంశంపై స్పష్టత ఇవ్వాలన్నారు. అన్ని కేడర్లలో ఖాళీల భర్తీకి నియామకాలు చేపట్టాలని, అన్ని కేడర్లలో క్రమబద్ధమైన ప్రమోషన్లు.కొత్తగా నిర్మించిన సబ్‌స్టేషన్లకు అవసరమైన మానవ వనరుల నియామకం చేపట్టాలన్నారు. ఈపిఎఫ్ పెన్షనర్లకు వైద్య సౌకర్యాల కల్పన.సాధారణ బదిలీ విధానం అమలు చేయాలనీ వారు కోరారు. ఈపిఎఫ్ ఉద్యోగులకు ఎంప్లాయర్ కాంట్రిబ్యూషన్ పై సీలింగ్ తొలగించాలని, టైం బాండ్ ప్రమోషన్స్ అమలు, విద్యుత్ ఉత్పత్తి రంగంలో సామర్థ్య విస్తరణ ట్రాన్స్‌మిషన్ మరియు డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ బలోపేతం. చేయాలనీ వారు సీఎండీ ని కోరారు. సీఎండీ ని కలిసిన వారిలో టీజీపిఈ జాక్ చైర్మన్ జి. సాయిబాబ, కన్వీనర్ పి. రత్నాకర్ రావు, జనరల్ సెక్రెటరీ ఈ. శ్రీధర్, టీజీఎస్పీడీసీఎల్ 327 సెక్రెటరీ కంది భూపాల్ రెడ్డి నాయకులు తాజుద్దీన్ బాబా, పవన్, వజీర్, సదానందం, కుమారస్వామి, సుధాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాంజీ, ఈశ్వర్ గౌడ్, సత్యనారాయణ, మోజెస్, నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

**హైదరాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**

ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆరఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రా□భివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ` జీ ఆరఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో□ అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

### పరిశ్రమల అభివృద్ధికి టీజీఎస్పీడీసీఎల్

# సీఎండీ తోడ్పాటు అభినందనీయం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

పరిశ్రమల సమస్యల పరిష్కారానికి టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ చేస్తున్న కృషి ఎంతగానో అభినందనీయమని ఎఫ్టీసీసీఐ ఉపాధ్యక్షులు గరిమెళ్ల శ్రీనివాస్ కొనియాడారు. హైదరాబాద్ రెడ్ హిల్స్‌లోని ఎఫ్టీసీసీఐ ఫెడరేషన్ హౌస్‌లో గురువారం నిర్వహించిన పారిశ్రామికవేత్తల సమావేశంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రగతి మరియు అభివృద్ధి కోసం సీఎండీ అందిస్తున్న నిరంతర తోడ్పాటును మరియు పారిశ్రామికవేత్తలకు ఆయన ఇస్తున్న మరువలేని సహకారాన్ని ఎఫ్టీసీసీఐ ప్రతినిధులు ఘనంగా అభినందించారు. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు మరియు వివిధ పారిశ్రామిక సంఘాలతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని తక్షణ పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్న సీఎండీ జితేష్ వి. పాటిల్ సేవలను ఎఫ్టీసీసీఐ ప్రతినిధులు ప్రత్యేకంగా ప్రశంసించారు. గత మూడు నెలలుగా ఆయన పరిశ్రమల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు మరియు వివిధ సంఘాల నాయకులతో ప్రత్యక్షంగా సమావేశమవుతున్నారని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే విద్యుత్ సరఫరా, విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పన, నెట్‌వర్క్ బలోపేతం, కొత్త కనెక్షన్ల మంజూరు మరియు పారిశ్రామిక విద్యుత్ సేవలకు సంబంధించిన అన్ని అంశాలపై సానుకూలంగా స్పందిస్తూ సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నారని వారు పేర్కొన్నారు.

**పంపిణీ సంస్థపై పెరిగిన విశ్వాసం**

పారిశ్రామిక వర్గాలతో నిరంతర సంభాషణ జరపడం, సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించడం మరియు వేగవంతమైన పరిష్కార చర్యలు చేపట్టడం ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థపై పారిశ్రామికవేత్తలలో విశ్వాసం మునుపటి కంటే మరింత పెరిగిందని ఎఫ్టీసీసీఐ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రజా సేవా దృక్పథంతో నిరంతరం పనిచేస్తూ, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్న సీఎండీ జితేష్ వి. పాటిల్ గారికి ఎఫ్టీసీసీఐ ఈ సమావేశం ద్వారా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఎనర్జీ కమిటీ చైర్మన్ వినోద్ అగర్వాల్, తెలంగాణ ఐరన్ అండ్ స్టీల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధి అనిల్ అగర్వాల్, తెలంగాణ స్పిన్నింగ్ అండ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ ప్రతినిధి సుశీల్ సంసేటి, సోలార్ డెవలపర్స్ అసోసియేషన్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులతో పాటు వివిధ పరిశ్రమలకు చెందిన సుమారు నలభై మంది ప్రముఖ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త


**హైదరాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ముగిసిన బ్రహ్మనాయుడు కస్టడీ

- **కోర్టుకు తరలించిన పోలీసులు**

**హైదరాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**



ఫేక్ జీవో కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కస్టడీ పూర్తయ్యింది. మూడురోజుల కస్టడీ ముగియడంతో బొల్లా బ్రహ్మనాయుడిని రంగారెడ్డి జిల్లా కోర్టుకు పోలీసులు తరలించారు. బ్రహ్మనాయుడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించారు. అయితే కస్టడీలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే ఏమాత్రం సహకరించనట్లు తెలుస్తోంది. ఏ ప్రశ్న అడిగినా 'తెలియదు, గుర్తులేదు' అనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రూ.1000 కోట్ల భూమిని అక్రమంగా కొట్టేయాలని బ్రహ్మనాయుడు ప్లాన్ చేసినట్టు ఈవోడబ్ల్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. భూమిని కొట్టేసేందుకు బ్రహ్మనాయుడు రూ.8 కోట్లు సమకూర్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపైనే ప్రశ్నలు వేయగా.. మాజీ ఎమ్మెల్యే సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉంటూ తనకేం తెలియదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు నిందితులు కస్టడీలో వెల్లడించిన వివరాలను ఆధారంగా చేసుకొని బ్రహ్మనాయుడిని అధికారులు ప్రశ్నించారు. 'వారు చెప్పిన సమాధానాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు' అని పోలీసుల ముందు బ్రహ్మనాయుడు బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.



## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

- **జర్నలిస్టులకు అవగాహన కార్యక్రమం**

**హైదరాబాద్, జూన్ 18:**

జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అంశంపై తెలంగాణ మీడియా అకాడమి, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులతో ప్రత్యేక అవగాహన మరియు పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు ఉదయం 11.00 గంటలకు మీడియా అకాడమి ఆడిటోరియం, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పక్రియ, దాని లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంటలకు ముగియనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు తమ పేర్లను 20వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటలలోపు వాట్సాప్ నంబర్ 7093600977 కు పంపి నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువులోపు తమ పేర్లను నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

**మొదటిపేజీ తరువాయి**

ఉద్దేశించి 'ఎప్పటిలోగా సరెండర్ అవుతారని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు, ఒక పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సంఘటనల్లో పాల్గొనకుండా ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి తనను తాను నియంత్రించుకోవాల్సిన బాధ్యత ఉందని వ్యాఖ్యానించింది. ఎంపీని వేధింపులకు గురిచేయబోతున్నారని సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసునని హైకోర్టు తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆయన స్వచ్ఛందంగా వెళ్లి పోలీసుల ఎదుట సరెండర్ కావడం మంచిదని సూచించింది. ముందస్తు బెయిల్ కోరుతూ కొనసాగాలా, లేక సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకోవాలా అనే విషయంపై నిర్ణయం తీసుకుని కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్‌తో సంప్రదించి తదుపరి నిర్ణయాన్ని హైకోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి కోర్టు ముందు తమ వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోకుండా, కేసు విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తదుపరి విచారణలో సునీల్ కుమార్ నాయక్ తరఫు నిర్ణయం, కోర్టు పరిశీలనలు కీలకంగా మారనున్నాయి.




## యూరియా యాప్ తొలగించాల్సిందే

- **బిఆరఎస్ ఆధ్వర్యంలో ఆందోళన**
- **ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిజామాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**

యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆరఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దుకాణాల్లో లేని యూరియా బస్తాలు యాప్ ద్వారా ఎలా రైతులకు అందుతాయని ప్రశ్నించారు. యాప్ వల్ల గ్రామాల్లో రైతులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అందుకే యూరియా యాప్ తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతులకు ఎరువులు సకాలంలో పథకాలు అందించడంతోపాటు రైతు సంక్షేమం కోరిందని గుర్తు చేశారు.

## నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

- **వందతులను నమ్మొద్దని విద్యార్థులకు వినతి**
- **21న రీ టెస్టు కోసం ఏర్పాట్లు పూర్తి: ఎన్‌టీఏ**

**న్యూఢిల్లీ, జూన్ 18 సిరి న్యూస్:**

నీట్`యంజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ఎన్టీఏ తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప□చారాన్ని నమ్మొద్దని 'ఎక్స' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా పక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చని ఎన్‌టీఏ సూచించింది.పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్`యంజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

## అనుమానాస్పద స్థితిలో దంపతుల మృతి

- **కుమారుడి ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు**

**కుమ్రంభీం ఆసిఫాబాద్, జూన్ 18:**

కుమ్రం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలో అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి చెందడం కలకలం సృష్టిస్తోంది. తుంపల్లి గ్రామపంచాయతీ కోసార గ్రామ పరిధిలోని భవానీ నగర్‌లో దారుణం చోటు చేసుకుంది. బానోత్ రాజు ,సునీత దంపతులు బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఇద్దరు దంపతులు కొడుకు, కోడలుతో కలిసి భవానీనగర్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. రాత్రి భోజనం చేసిన అనంతరం భార్యాభర్తలు ఇద్దరు ఇంటి బయట వరండాలో పడుకున్నారు. రాత్రి 3 గంటల ప్రాంతంలో కరెంట్ పోవడంతో కోడలు తమ చిన్న పాపను అత్త సునీత దగ్గర పడుకోబెట్టేందుకు వచ్చి నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా ఆమె నుంచి స్పందన రాకపోవడంతో చూడగా అప్పటికే ఇద్దరు మృతి చెందారు. గతంలో పీరీల విషయంలో గొడవలు జరిగాయని, తమ తల్లిదండ్రులను హత్య చేసి ఉంటారని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

- **రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు . జూన్ 21న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్లు ప్రకటించారు . పరీక్షా రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్ష కోసం.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక మార్పులను ప్రకటించింది. ఎగ్జామ్ ను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విద్యార్థులకు అనుకూలంగా మార్చేందుకు ఎన్టీఏ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఈసారి ఎగ్జామ్ టైంను 195 నిమిషాలకు పెంచారు. ఎగ్జామ్ మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనుంది. ఎగ్జామ్ ప్రారంభానికి ముందు అటెండెన్స్ డాక్యుమెంట్స్ పై సైన్ లు చేయడం, ఇన్విజిలేషన్ లాంఛనాలు పూర్తి చేయడం వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల.. విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎన్టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది. దీనివల్ల అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టవచ్చు. ఎగ్జామ్ రోజున విద్యార్థులకు పూర్తి స్పష్టత, సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన ఈ కొత్త నిబంధనలను అభ్యర్థులందరూ గమనించాలని ఎన్టీఏ స్పష్టం చేసింది.

# నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

- **మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి**
- **వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం**

**హైదరాబాద్, జూన్ 18 సిరి న్యూస్:**

రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హైదరాబాద్ ` వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఎస్సై బండి శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలంలో కిరాణా దుకాణం నిర్వహించే జాట్ రోహిత్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండ కొత్తపల్లికి చెందిన మధు.. టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తుండగా.. తెల్లవారుజామున జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సవి□పంలోకి రాగానే ట్రక్కు టైరు పంక్చర్ అయింది. అదే దారిలో వెళ్తున్న లారీని ఆపి జాకీ తీసుకున్నారు. లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు □డైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్.. పంక్చర్ అయిన టైరును మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి`మురహరిపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అతి వేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కారులో నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. వికారాబాద్‌జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్‌పాషా (30) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు, డీసీఎం వ్యాన్ సిరిసిల్ల బైపాస్‌పై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిది జగిత్యాలగా తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



# విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

- కస్తూరిపల్లి రమేశ్ బాబు, సిద్ధిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

**నంగునూరు, జూన్ 18, (సిరిన్యూస్):** మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్, కృత్రిమ మేధ వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలని సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి పల్లి రమేష్ బాబు విద్యార్థులకు సూచించారు. రమేశ్ బాబు స్వగ్రామమైన గట్ల మల్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామ మాజీ సర్పంచి కర్ణకంటి రవీంద్రాచారి చొరవతో సిద్ధిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరిపల్లి రమేశ్ బాబు రూ.60 వేలు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూటర్ గురువారం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదాసి రమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం కంప్యూటర్ల అవసరం ఎంతో ఉందని చెప్పారు. దీనిని సక్రమంగా వినియోగించుకుని కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కంప్యూటర్ బహుకరించిన రమేశ్ బాబుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదాసి రమేశ్ బాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ కంప్యూటర్ ను వినియోగించుకుని విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుతామని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ ఇంగ నరేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సాయం అందించే దాతలను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు పాఠశాల అభివృద్ధి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కర్ణకంటి రవీంద్రాచారి, ఉపాధ్యాయులు అశోక్, విజయ్ కుమార్, నోముల లింగం, పంతం నరేశ్, దర్శనాల రాజ్ కుమార్, బాబు పాల్గొన్నారు.




# ఆత్మీయులతో బొగ్గుల సురేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి. జూన్ 18, (సిరిన్యూస్) :** శ్రీ తిరుమల ఎంటర్ప్రైజెస్ మేనేజింగ్ పార్ట్నర్, జగద్గిరిగుట్ట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, పద్మ డిజిటల్ స్టూడియో అధినేత బొగ్గుల సురేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఆయన కుటుంబ సభ్యులు, తోటి పార్ట్నర్లు, సన్నిహితుల మధ్య తిరుమల ఎంటర్ప్రైజెస్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన సన్నిహితులు పుచ్చపండు కట్ చేయించి శాలువాతో సన్మానిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొగ్గుల సురేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు ఇంతటి పండుగ వాతావరణం మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్ట్నర్లు డాక్టర్ బండారు శ్రీనివాస్, చెంచారపు భాస్కర్ రెడ్డి, కూరపాటి కరుణాకర్ రాజు, తేరాల శ్రీనివాస్ గుప్తా, రేగూరి ప్రవీణ్ గుప్తా, కూరపాటి శ్రీ రామరాజు, పబ్బోజు వీరాచారి, పాండాల శ్రీనివాస్ గౌడ్, అవుర్థి వీరేశప్ప, బింగి శ్రీనివాస్ గౌడ్, పోలేపల్లి శేషారెడ్డి, సరస్వతి నరేందర్ రాజు, జనుముల జగన్మోహన్ ముదిరాజ్, దొడ్ల ప్రసాద్ గౌడ్, హరిదాసు సంతోష్ రాజు లు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ధాబాలపై పోలీసుల ఆకస్మిక దాడులు

**తూప్రాన్ జూన్ 18 (సిరిన్యూస్)**

తూప్రాన్ బైపాస్ జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న ధాబాలపై తూప్రాన్ పోలీసులు గురువారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు కొన్ని ధాబాలలో అక్రమంగా మద్యం సేవించేందుకు ప్రోత్సహిస్తున్నట్టు నమ్మదగిన సమాచారంతో దాడులు నిర్వహించగా 6 ధాబాల నిర్వహాకులపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు తూప్రాన్ సిఐ వెంకట్ రాజా గౌడ్ మాట్లాడుతూప్రజలకు ప్రయాణికులకు దాబాల లో అక్రమంగా మద్యం సేవించేందుకు ప్రోత్సహించిన దాబా యజమానుల పైన చట్టపరమైన చర్యలను చేపడుతామని హెచ్చరించారు దాబాలపై దాడులలో సిఐ వెంకట్ రాజా గౌడ్ తూప్రాన్ ఎస్ఐ గంగరాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు




# యూరియా యాప్‌ను రద్దు చేయాలి

**కుకునూరుపల్లి, జూన్ 18,(సిరిన్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ వల్ల చదువురాని సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసినా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి పంటల కొనుగోలు, రైతుబంధు జమ, కరెంట్, సాగునీటి సరఫరాలో విఫలమై రైతులను నష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు. దుకాణాల్లో యూరియా ఉన్నప్పటికీ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతూ రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. గత చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సరిపడా యూరియాను ముందే స్టాక్ ఉంచాలని పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకూ ఇబ్బంది లేకుండా ఎరువులు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వారి వెంట సర్పంచ్ లు బురుగు మధు మోహన్, దబ్బేట భాస్కర్, బిఆర్ఎస్ నాయకుడు చిక్కుడు నర్సింలులు ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- రామాయంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ నవనీత గణేష్
- డివైడర్లపై మొక్కలు నాటిన మున్సిపల్ పాలకవర్గం

**రామాయంపేట, జూన్ 18( సిరి న్యూస్)**



భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, పర్యావరణాన్ని సంరక్షించాలని రామాయంపేట మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోచమ్మల నవనీత గణేష్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మెదక్ చౌరస్తాలోని రోడ్డు డివైడర్ పై మున్సిపల్ కమిషనర్ ఎ. రవీందర్, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్పర్సన్ నవనీత గణేష్ మాట్లాడుతూ.. పచ్చని తెలంగాణే లక్ష్యంగా వనమహోత్సవం పేరిట పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ఆస్తులు ఇవ్వకపోయినా పరవాలేదు కానీ, పచ్చని పర్యావరణాన్ని అందిస్తే వారి భవిష్యత్తు బాగుంటుందని పేర్కొన్నారు. చెట్లతోనే సకాలంలో వర్షాలు కురుస్తాయని, వాతావరణం చల్లబడి మానవాళి ఆరోగ్యంగా ఉంటుందని ఆమె అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ. రవీందర్ మాట్లాడుతూ, కౌన్సిల్ సూచనల మేరకు మెదక్ రోడ్డు పరిధిలో సుమారు 100 మొక్కలను నాటే ప్రక్రియను చేపట్టామని తెలిపారు. చెట్లు వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని, మనకు కావాల్సిన స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయని, భూసారాన్ని రక్షిస్తాయని వివరించారు. మొక్కల వల్ల లాభాలే తప్ప ఎలాంటి నష్టాలు లేవని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ప్రాంగణాల్లో పూల మొక్కలు, పండ్ల మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు , కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఆర్పీలు, ప్రజాప్రతినిధులు మరియు పురపాలక సంఘ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు చౌదరి చరిత,భైరం స్వప్న, మద్దెల మాధవి, సందీప్, రవి నాయక్, కో ఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, చింతల రాధా భవానీ, గౌస్ తో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలపై కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి.

- ఉదయం 5 గంటల నుంచే బీఆర్ఎస్ నాయకుల అరెస్టులు దుర్మార్గమైన చర్య.
- లాఠీలు, తూటాలు, అరెస్టులకు భయపడేది కాదు బీఆర్ఎస్ పార్టీ.
- పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు.

**మెదక్,జూన్,18 (సిరిన్యూస్)**




మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు తెల్లవారుజామున 5 గంటల నుంచే ముందస్తుగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు విమర్శించారు.ఈ సందర్భంగా మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి కారణం చెప్పకుండా ఉదయం నుంచే పలువురు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. అనంతరం సీఎం నివాసం ముట్టడి చేసే అవకాశముందని భావించి ముందస్తు అరెస్టులు చేసినట్లు పోలీసులు చెప్పారని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీకి అరెస్టులు కొత్త కాదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో అరెస్టులు, లాఠీచార్జీలు, కేసులు, తూటాలను ఎదుర్కొంటూ ప్రజల కోసం పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. లాఠీలు, తూటాలు, అరెస్టులకు తమ పార్టీ నాయకులు భయపడరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్ష నాయకులపై దృష్టి సారించడం సరికాదని విమర్శించారు.అరెస్టులతో బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేయలేరని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు ప్రజల పక్షాన పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు.అరెస్టయిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కోకన్వీనర్ గడ్డమీద. కృష్ణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్, దీపక్ కుమార్, జుబేర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, నాయకులు ప్రభు రెడ్డి, ఇందాద్, సాయి తదితరులు ఉన్నారు.

# రియల్ లైఫ్ లో 'రియల్ హీరో'

- గౌడ జాతికే వన్నెతెచ్చిన ఆణిముత్యం
- సమాజ సేవకై నిరంతరం పరితపించే కోహినూర్ వజ్రం
- ప్రజా హృదయాలలో చెరగని ముద్ర
- డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ చేసిన అరుదైన సేవలకు రాష్ట్ర సేవా పురస్కార్ ప్రధానం

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూన్ 18, (సిరిన్యూస్)**

సినిమా తెరపై రంగుల ప్రపంచంలో ప్రజాసేవ చేస్తున్నట్లు ఫోజులిచ్చే రీల్ హీరోలను చూసి ఈలలు వేస్తాం..చప్పట్లు కొడతాం. కానీ..నిజ జీవితంలో అంకితభావంతో ప్రజలకు సేవ చేసి శభాష్ అనిపించుకునే రియల్ హీరోలు కొందరే ఉంటారు. అలాంటి వారిలో ప్రజాసేవకై నిరంతరం పరితపించే వారిలో ఒకరిగా భీమగాని యాదగిరి గౌడ్ నిలిచారు. ఈ క్రమంలో జూన్ 15, 2026న తెలంగాణ సరస్వతీ పరిషత్ హాల్ లో జరిగిన ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుకు భీమగాని యాదగిరి గౌడ్ ఎంపికైనారు. ఓరుగల్లు నగరానికి చెందిన డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ చేసిన ప్రజా సేవలను గుర్తించిన స్ఫూర్తి అకాడమీ వారు రాష్ట్ర సేవా పురస్కారం అవార్డును అందించారు. డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ గత 40 సంవత్సరాల క్రితం నుండే తన తల్లి గారైన భీమగాని లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టినారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన విద్యార్థులను గుర్తించి వారికి నగదు పారితోషకంతో పాటు జ్ఞాపికలను అందించి విద్యార్థులను ప్రోత్సహించేవారు. అంతేకాకుండా అనాధ ఆశ్రమాలలో అన్నదానాలు చేయడం, రైల్వే స్టేషన్, బస్టాండ్లలో ఉండేటువంటి అనాథలను గుర్తించి వారికి దుప్పట్లు, అన్నం ప్యాకెట్లు మరియు వాటర్ బాటిల్ లను అందించేవారు. చలికాలంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేసేవారు. తన ముందు ఎలాంటి అన్యాయం జరిగిన సహించకుండా..వెంటనే అన్యాయాలను ఖండించి, ఇరు వర్గాలకు న్యాయం చేసేవారు, నిరుపేదలకు మెడికల్ క్యాంపులు నిర్వహించి పేదలకు ఉచితంగా మెడిసిన్ సప్లై చేసేవారు. ఎదుటివారికి ఎలాంటి కష్టం వచ్చిన..తన కష్టంగా భావించి ఆర్థిక సహాయాలను అందించేవారు. ఇలాంటి ప్రజాసేవ కార్యక్రమాలను ఎన్నో చేసిన డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ ఉత్తమ సేవలకు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ సందర్భంగా భీమగాని యాదగిరి గౌడ్ మాట్లాడారు. తాను తీసుకున్న ఈ సేవ పురస్కారం అవార్డు తన యొక్క బాధ్యతను మరింత పెంచిందన్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన స్ఫూర్తి అకాడమీ వ్యవస్థాపకులు ఆకుల రమేష్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గౌడ జాతిలో పుట్టిన ఈ ఆణిముత్యం..సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వారసత్వాన్ని పునికి పుచ్చుకొని.. బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్న కోహినూర్ వజ్రం..బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ మరెన్నో సేవలు చేసి..ఆయన జీవితంలో ఇంకా ఎన్నో పురస్కారాలు అందుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# దమ్మపేట చిరు వ్యాపారులకు అభయహస్తం

- పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణానికి ముగ్గు పోసిన పాలకవర్గం

**దమ్మపేట, జూన్ 18, (సిరిన్యూస్):**



దమ్మపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీకి చెందిన స్థలంలో షాపుల నిర్మాణానికి ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ఉంది. గురువారం భూమి పూజ నిర్వహించి షాపులు నిర్మాణం చేయుటకు ఇంజనీర్ చే ముగ్గు పోశారు. 9 సం.ల క్రితం వరకు ఇట్టి స్థలంలో సంత నిర్వహించబడేది. ప్రస్తుతం సంత కొట్టులు రాజీవ్ గాంధీ సెంటర్ వైపు మళ్ళడం తో ఖాళీగా ఉన్న ఇట్టి పంచాయతీ ప్రదేశంలో కొత్తగా ఏర్పడిన పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి శుభ్రం చేయించి, షాపులు నిర్మాణం కొరకు గురువారం గ్రామ పెద్దల సమక్షంలో మొత్తం 19 షాపులకు ముగ్గు పోశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బండి అనంత్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా దమ్మపేట ప్రధాన రహదారి ఇరువైపుల గల డ్రైనేజీలపై ఆక్రమణ చేసిన వ్యాపారులకు నోటీసులు పంపించి ఖాళీ చేయాలని చెప్పడంతో పూర్తిగా డ్రైనేజీ షాప్ లు నిర్వహిస్తున్న వ్యాపారులు తమకు ప్రత్యామ్నాయ స్థలం కావాలి అని సర్పంచ్ ని కోరినందున 19 షాపులకు లాటరీ ద్వారా లీజు కేటాయింపు మరియు అధికారిక నిబంధనలు తప్పనిసరి తో లీజు వ్యవధి, నెలవారీ అద్దె చెల్లింపులు, మరియు నిర్వహణ నియమాల పై త్వరలో ఎవరైతే పూర్తిగా డ్రైన్ల పై వ్యాపారం చేస్తున్న వారికి ముందుగా అవకాశం అని తెలియజేశారు. జూన్ 20 వ తేదీన దమ్మపేట ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రైన్ల ఆక్రమణలను జే. సి.బి తో తొలగిస్తామని చెప్పారు. ఇప్పటికే పలు మార్లు ప్రతీ షాప్ యజమానికి నోటీస్లు ఇచ్చామని, మైక్ పెట్టి ప్రచారం చేశాం అని, ఇక అవకాశం ఇవ్వలేము అని డ్రైన్ పై నుండి రోడ్డు మధ్యలో షాప్ బోర్డు లు కూడా తొలగించాలి అని తెలియజేశాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, గ్రామస్తులు పగడాల రాంబాబు, చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, గోపి, ముక్తేశ్వరరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, దాసరోజు రామారావు, రామబ్రహ్మం, పండూరి వీరబాబు, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, గట్ల సర్వేశ్వరరావు, శ్రీను, నాగరాజు, నల్లగట్ల సత్యంబాబు, వనమాల సూరిబాబు, ఏలూరి సత్తిబాబు, దేవయ్య, తిరువీధుల శ్రీను, పగడాల గోపి, భాస్కర్, పంచాయతీ సిబ్బంది మహాదేవ సాయి, కాకాని గణేష్, భీమా శ్రీనివాసరావు, కొప్పర్తి సింగ్ తదితరులు ఉన్నారు.

# సొంత నిధులతో దేవాలయాల నిర్మాణం..

**ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రాధాన్యత**



**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 18, (సిరి న్యూస్):**

పటాన్చెరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు దేవాలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణాలకు సహకరిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.గురువారం జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీలో శివాలయం, రామాలయం, అమ్మవారి దేవాలయాల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించిన ఆయన, అనంతరం బండల మల్లన్న దేవాలయం ఆవరణలో చౌడమ్మ దేవాలయం నిర్మాణానికి భూమి పూజ చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణాల కోసం సొంత నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.అనంతరం పటాన్చెరు పట్టణంలో నిర్మాణంలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో గడప ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. దేవాలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో జి. సుప్రియకు పీహెచ్‌డీ అర్హత

**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 18, (సిరి న్యూస్):**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని జి. సుప్రియ డాక్టరేట్ (పీహెచ్‌డీ) కు అర్హత సాధించారు.'పర్యావరణ, జీవసంబంధ అనువర్తనాల కోసం హైబ్రిడ్ లోహ నానో కాంపోజిట్ల జీవసంశ్లేషణ' అనే అంశంపై ఆమె పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు డాక్టర్ కె. ఫణి రాజా మార్గదర్శకత్వం వహించగా, డాక్టర్ పి.వి. నాగేంద్ర కుమార్ సహ–పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. సుప్రియ పీహెచ్‌డీ అర్హత సాధించిన సందర్భంగా గీతం యాజమాన్యం, అధ్యాపకులు ఆమెను అభినందించా

# గవర్నమెంట్ కాలేజీ సీట్లకు అనుగుణంగా కొత్త హాస్టల్ లు నిర్మించాలి

**గుడికందుల రవి**

**సిద్దిపేట జూన్ 18(సిరి న్యూస్ )**



జిల్లాలోని కాలేజ్ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హాస్టల్ లో సీట్లను తక్షణమే పెంచాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా షెడ్యూల్ కులాల శాఖ అధికారి ఇంచార్జ్ సంపత్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ, ఉన్నత చదువుల కోసం ఇంటర్, డిగ్రీ కోర్సులు అభ్యసించేందుకు పేద విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాస్టళ్లపై ఆధారపడుతున్నారని . అయితే హాస్టళ్లలో తగినన్ని సీట్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు ప్రైవేట్ గదులు అద్దెకు తీసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు చదువులను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని అవసరమైతే కొత్త హాస్టళ్లను ఏర్పాటు చేయాలని లేకపోతే విద్యార్థుల హక్కుల కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి జశ్వంత్, నాయకులు వినయ్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

# విలేకరి నర్సింలు కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్, జూన్ 18 (సిరి న్యూస్ )**

గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ నర్సింలు కుమార్తె రాజేశ్వరి (24) మృతి చెందిన ఘటనపై గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నర్సింలు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి మనోధైర్యాన్ని కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఆవేశ పూరిత నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు కడుపుకోత కలిగించవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, గ్రామ సర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ బాపురెడ్డి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్నార్ పరిశ్రమలో ఎన్నికల గేట్ మీటింగ్

- **సీఐటీయూకు ఐఎన్టీయూసీ మద్దతు**
- **చారిత్రాత్మక వేతన ఒప్పందం చేస్తామని నేతల హామీ**
- **కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం**
- **ముఖ్య అతిథులుగా చుక్క రాములు, శ్రీనివాస్ గౌడ్**

**రామచంద్రపురం, జూన్ 18, (సిరి న్యూస్):**





పెన్నార్ పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల గేట్ మీటింగ్‌లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు పాల్గొని ఎన్నికల నేపథ్యంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ పెన్నార్ పరిశ్రమలో చారిత్రాత్మక వేతన ఒప్పందం సాధించి చూపిస్తామని, కార్మికుల అన్ని సమస్యలను పరిష్కరించేందుకు సీఐటీయూ కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో బిఆర్ టీయూ కార్మికులను మోసం చేసిందని, వేతన ఒప్పందంలో ప్రకటించిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. మహిళా కార్మికుల సమస్యలు, క్యాంటీన్ సౌకర్యాలు, రవాణా సదుపాయాలు వంటి అంశాలు కూడా పరిష్కారం కాలేదని ఆయన ఆరోపించారు. అలాగే గత ఒప్పందాల్లో 565 మంది కార్మికులను పర్మనెంట్ చేయించిన చరిత్ర సీఐటీయూకు ఉందని పేర్కొంటూ, మెరుగైన వేతనాలు, బోనస్, యూనిఫామ్, గిఫ్టులు వంటి సౌకర్యాలు సాధించేందుకు సీఐటీయూనే గెలిపించాలని కోరారు.కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సీఐటీయూకు ఐఎన్టీయూసీ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్మికులకు నిరంతరం సేవ చేస్తున్న సంఘాన్ని గెలిపించాలని ఆయన కోరారు. అవినీతిపరులను ఎన్నికల్లో దూరం పెట్టాలని సూచించారు. సీఐటీయూ పనితీరును గమనిస్తూనే కార్మికుల కోసం సేవ చేసే వారిని ప్రోత్సహిస్తున్నామని, అవసరమైతే తప్పులను కూడా నిలదీస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్, కోశాధికారి కే రాజయ్యతో పాటు యూనియన్ నాయకులు శేషగిరి, త్రిమూర్తులు, రెహమాన్, శివపాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జయమ్మ, శ్రీశైలం, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం..

**హత్నూర, జూన్ 18,(సిరి న్యూస్)**

హత్నూర మండలం మంగాపూర్ గ్రామంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు విద్యా ప్రపంచంలోకి తొలి అడుగు పెట్టిన ఈ వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది.గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ వీరమణి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో గతంతో పోల్చితే విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరగడం శుభపరిణామమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది విద్యేనని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఉపసర్పంచ్ కృష్ణవేణి, వార్డు సభ్యుడు నవీన్




కుమార్, సునీత, లక్ష్మి , విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో చిన్నారులకు ఆశీస్సులు అందజేసి వారి విద్యాభ్యాసం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ

- **ఎస్ఐఆర్ 2026 ఒకటి కంటే ఎక్కువ ఓటరు నమోదుల నివారణపై అవగాహన కల్గి ఉండాలి.**
- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ జూన్,18(సిరి న్యూస్)**





భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR)–2026 కార్యక్రమం నిర్వహించబడుతున్న సందర్భంగా, ప్రజలు , రాజకీయ పార్టీలు ఓటరు నమోదుకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్లు 17, 18 మరియు 31 ప్రకారం: సెక్షన్ 17: ఏ వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల ఓటరు జాబితాలలో పేరు నమోదు చేసుకోవడానికి అర్హుడు కాదని అన్నారు.

**సెక్షన్ 18:** ఒకే నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో ఒకటి కంటే ఎక్కువ సార్లు పేరు నమోదు చేసుకోవడానికి ఏ వ్యక్తికీ అర్హత లేదనీ,

**సెక్షన్ 31:** ఓటరు జాబితా తయారీ, సవరణ, సరిదిద్దడం, పేరు చేర్పు లేదా తొలగింపుకు సంబంధించి ఎవరైనా కావాలని తప్పుడు సమాచారం లేదా అసత్య ప్రకటన సమర్పించినట్లయితే, వారికి ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించబడే అవకాశం ఉందన్నారు.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సందర్భంగా ఓటర్లు తమ పేరు ఒకే చోట మాత్రమే నమోదు అయి ఉందో లేదో పరిశీలించుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు.రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు ,ప్రజలు ఈ నిబంధనలపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని, స్వచ్ఛమైన ఖచ్చితమైన ఓటరు జాబితాల తయారీలో సహకరించాలని కోరారు.

# ముదిరాజు సంఘం భవనానికి చైర్మన్ విరాళం

- **మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, జూన్ 18 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన ముదిరాజు సంఘం భవన అభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తన వంతు సహాయంగా రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఆయన తరఫున సీకేజీ యువసేన సభ్యులు గురువారం ముదిరాజు సంఘం అధ్యక్షుడు కుంటి మల్లేష్‌కు నగదు రూపంలో విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ ముదిరాజు సంఘం భవనం సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రబిందువుగా మారాలని ఆకాంక్షించారు. సమాజ అభ్యున్నతికి సంఘ భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ముదిరాజు సంఘం భవన నిర్మాణానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సంఘ భవనం ద్వారా వివిధ సామాజిక, విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. సంఘ అభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ అందించిన ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని సంఘ నాయకులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అందించిన విరాళానికి ముదిరాజు సంఘం ప్రతినిధులు, సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు



తెలిపారు. భవిష్యత్తులో కూడా సంఘ అభివృద్ధికి ఆయన సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్, ముదిరాజు సంఘం సభ్యులు, సీకేజీ యువసేన సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

**రామచంద్రపురం, జూన్ 18, (సిరి న్యూస్):**

తెల్లాపూర్ జ్యోతిరావు పూలే కాలనీలోని శ్రీ విజయదుర్గా పెద్దమ్మ ఆలయంలో నిర్వహించిన శ్రీ శివ పంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తుల విశేష స్పందన మధ్య గురువారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు సాగిన ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కొల్లూరి అమృతమ్మ–సత్తయ్య దంపతులు, కొల్లూరి లక్ష్మి –భరత్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవాల్లో శివలింగ ప్రతిష్ఠాపన, నవగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా



జరిగాయి. హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు, వేదాశీర్వచనాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.కాశీ పీఠాధీశ్వరులు పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ శివనాగేంద్ర సరస్వతి మహాస్వామి, పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వాములు మహోత్సవాల్లో పాల్గొని ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు ఆశీస్సులు అందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్, నీలం మధు, గువ్వల బాలరాజు, కాటా శ్రీనివాస్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, జోగిని శ్యామల, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, మాజీ కార్పోరేటర్లు మెట్టు కుమార్, పుష్ప నగేష్ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో సుమారు పది వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేలా నిర్వహించిన ఈ మహోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో సనాతన ధర్మ వైభవాన్ని చాటిచెప్పిన ఈ కార్యక్రమం భక్తుల ప్రశంసలు అందుకుంది.

# రైతులు యాప్ ద్వారానే యూరియ బుక్ చేసుకోవాలి

- మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదు కలెక్టర్.
- ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్,మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ కలదు.
- రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
- రైతులకు నాణ్యమైన సేవలందించాలి.
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.
- పారదర్శక సేవలతో రైతుల విశ్వాసం పొందాలి.
- జిల్లా లెక్టర్ ప్రతిమా సింగ్.



మెదక్,జూన్,18 (సిరిన్యూస్)

రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలని, జిల్లాలో యూరియా కొరత లేదని, ప్రస్తుతం 6300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలదని రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.మెదక్ జిల్లాలో యూరియా సరఫరా విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ యూరియా కోసం యాప్ రూపొందించడం జరిగిందని రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకుని సమయానికి అనుగుణంగా డీలర్స్ దగ్గరకు వెళ్లి అవసరానికి అనుగుణంగా యూరియా తీసుకువచ్చున్నారు. యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదని ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్, మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదనీ ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం అని వివరించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు అందుబాటులో ఉండేలా రైతు సేవ కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు.రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్‌లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

# సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి.

- గస్తీ, నాకాబందీలతో నేర నియంత్రణకు చర్యలు.
- స్టేషన్ తనిఖీలో పెండింగ్ కేసులపై ఆరా.
- రామాయంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ. శ్రీనివాస రావు.

రామాయంపేట, జూన్ 18 (సిరి న్యూస్)





జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించాలని, నేర నియంత్రణకు గస్తీ, నాకాబందీలను మరింత ముమ్మరం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం రామాయంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ నిర్వహణ,తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న కేసులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ–సాక్ష్య యాప్ ద్వారా సంఘటన స్థలంలోని డిజిటల్ ఆధారాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు, కేసుల వివరాలను CCTNSలో సకాలంలో నమోదు చేసి నవీకరించాలని అధికారులను ఆదేశించారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, రాత్రి గస్తీలు, వాహనాల తనిఖీలు, నాకాబందీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా www.cyber-crime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు.స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని పేర్కొన్నారు. ఎస్పీ వెంట సీఐలు సైదా, సందీప్ రెడ్డి, ఎసై బాలరాజు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇంటితో పేదోడి కల నెరవేరుతుంది

**నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి**

వెల్దుర్తి, జూన్ 18, (సిరి న్యూస్):



వెల్దుర్తి మండలం మెల్లూరు బస్వాపూర్ గ్రామలలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ముఖ్య అతిథిలుగా హాజరై గృహప్రవేశంలో పాల్గొని ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల అలాగే పేదల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్య బోధన కూడా ప్రభుత్వం కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నంబూద్రి గుప్తా, బంజరవి, నాయకులు తలారి అన్వేష్, మల్లేష్, శేఖర్ గౌడ్, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు అవుసుల మల్లేష్ చారి, ముక్తా బాయ్ తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఒక పుస్తకం.. వంద జీవితాలు మారుస్తుంది

- పఠనం – అదృశ్య ఆయుధం
- నేడు జాతీయ పఠన దినోత్సవం..

జోగిపేట, జూన్ 18, (సిరి న్యూస్):





"పుస్తకం లేని ఇల్లు, కిటికీలు లేని ఇల్లుతో సమానం" టెక్నాలజీ ఎంత పెరిగినా, గూగుల్ ఎన్ని సమాధానాలు ఇచ్చినా – ఒక మనిషిని మనిషిగా నిలబెట్టేది మాత్రం పుస్తకమే. 1945లో కేరళలో పి.ఎన్. పణిక్కర్ అనే ఉపాధ్యాయుడు ఒకే ఒక కల కన్నారు. "ప్రతి ఇంట్లో పుస్తకం ఉండాలి. ప్రతి మనిషి చదవాలి". ఆయన ఉద్యమం వల్లనే కేరళ 100శాతం అక్షరాస్యత సాధించింది. ఆయన వర్ధంతి రోజైన జూన్ 19నే మనం 'పఠన దినోత్సవం'గా ప్రతి ఏడాది జూన్ 19న దేశమంతా జాతీయ పఠన దినోత్సవం జరుపుకుంటుంది. ఇది కేవలం ఒక రోజు వేడుక కాదు. ఇది మనిషిని మనిషిగా నిలబెట్టే రోజు . డాక్టర్‌కు పుస్తకం లేకుండా వైద్యం లేదు...ఇంజనీర్‌కు లెక్కలు లేకుండా వంతెన లేదు... రైతుకు పంటల పుస్తకం లేకుండా పంట లేదు. ప్రతి రంగానికి మూలం చదవడమే. చదివిన మనిషి మోసపోడు. మన చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. రోజుకు 4 గంటలు స్క్రోల్ చేస్తున్నాం. యూట్యూబ్, రీల్స్, వాట్సాప్ ఫార్వర్డ్‌లు. కానీ ఒక పుస్తకం 10 పేజీలు చదవాలంటే ఓపిక లేదు. సమాచారం వెల్లువలా వస్తుంది, కానీ జ్ఞానం కరువైంది. గూగుల్ మనకు 'ఏమిటి' చెబుతుంది. పుస్తకం 'ఎందుకు' అని ప్రశ్నించడం నేర్పుతుంది. చదవని మనిషి ఎప్పుడూ ఇతరుల మాటలపై ఆధారపడతాడు. చదివిన మనిషి సొంతంగా ఆలోచిస్తాడు. ఈరోజు యువత చేతిలో భవిష్యత్తు ఉంది. కానీ ఆ భవిష్యత్తును నిర్మించే పునాది పుస్తకం. పరీక్షల కోసం మాత్రమే కాదు, జీవితం కోసం చదవండి. మీరు చదివే ప్రతి పేజీ మిమ్మల్ని బలంగా చేస్తుంది. మీ ఆలోచనలను పెద్దది చేస్తుంది.ఎగ్జామ్స్ కోసం కాదు, చదవడం అంటే డిగ్రీ కోసం కాదు.

**పఠనం ఇచ్చే 3 శక్తులు**

1. ఊహాశక్తి: సినిమా చూపించనిది పుస్తకం చూపిస్తుంది. మీ మనసులో ప్రపంచాన్ని మీరే సృష్టించుకుంటారు.
2. భాషా శక్తి: చదివినకొద్దీ మాటలు పెరుగుతాయి. వాదించే ధైర్యం, రాసే స్పష్టత వస్తుంది.
3. వివేచన శక్తి: ఫేక్ న్యూస్‌ను గుర్తించడం, మోసాన్ని అర్థం చేసుకోవడం చదివిన మనిషికే సాధ్యం.

**చదవడం వల్ల ప్రయోజనాలు..**

మేదో సామర్థ్యం పెరిగి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, దృష్టి మెరుగుపడుతాయి. కొత్త సమాచారం తెలుస్తుంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపడతాయి. రచన ల పఠన, రాయడం అలవాటవుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. వివిధ విషయాలను అన్వే షించడానికి, ప్రపంచం గురించి లోతైన అవగాహన కలుగుతుంది. గ్రంథాలయానికి వెళ్లడం అలవరచుకోవాలి చదువుతో విజ్ఞానం, వికాసం లభిస్తాయి. గ్రంథాలయంలో వివిధ రకాల కొత్త పుస్తకాలు, పోటీ పరిక్షల పుస్తకాలు తెప్పిస్తున్నాం. వసతులను మెరుగుపరిచే దిశలో పనులు నడుస్తున్నాయి. పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరు గ్రంథాలయానికి వెళ్లి చదువుకునే అలవాటును అలవరచుకోవాలి. జి.అంజయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్

**ప్రతి రోజు చదువుతా...**

రోజూ కొంతసేపైనా చదువనిదే నాకు పాలు పోదు. ఇతర రచయితల రచనలు చదివినపుడే మన సృజనాత్మకత, రచనాశక్తికి పదును పెట్టిన ట్లవుతుంది. పిల్లల నుంచి పెద్దవారి వరకు ఎంతో కొంత సేపు చదవడం అలవాటు చేసుకోవాలి. పిల్లలకు బోధించే పాఠ్యాంశాలను సైతం ముందుగా చదువుకోవడం అలవాటు. పాఠ్య పుస్తకాలతోపాటు దిన పత్రిక, ఇతర కథలు, సైన్స్ పుస్తకాలు చదువుతాను.మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుంది.ఏ.మాణయ్య, ఉపాధ్యాయుడు

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు!!




శివంపేట జూన్ 18 ( సిరి న్యూస్ )

శివ్వంపేట మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ముఖ్యమంత్రి నివాసం ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలువురు పార్టీ నాయకులను వారి నివాసాల వద్దనే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.చట్టం, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అయితే, తమను అకారణంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి నివాసం ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకోవడానికే ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## దినపత్రికలలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు!

**అక్రమంగా ఆక్రమించిన కట్టడాలు కూల్చివేత!!**



శివంపేట జూన్ 18( సిరి న్యూస్ )

శివంపేట్ మండల కేంద్రంలోని ఉసిరికపల్లి గ్రామ శివారులో ప్రభుత్వ భూములపై జరిగిన ఆక్రమణలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. పత్రికల్లో వచ్చిన కథనాలకు అప్రమత్తమైన తహశీల్దార్ కమలాద్రి ఆదేశాల మేరకు సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన భూమిని గుర్తించారు. ఇటుక తయారీ పరిశ్రమ ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేశారు. సర్వేనెంబర్ 220, 221, 226, లో 0–28 గుంటల భూమిని గుర్తించారు.విలువైన ఈ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందని ఎమ్మార్వో కమలాద్రి చారి తెలిపారు.

## ప్రతి మాదిగ పల్లెలో ఎం ఆర్ పి ఎస్ జండా ఎగరాలి ..



హత్నూర, జూన్ 18,(సిరి న్యూస్)

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బోరపట్ల గ్రామం హత్నూర మండలంలో మాదిగ విద్యార్థులతో, యువతతో గంగారం మాదిగ , నరేందర్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై న బుచేంద్ర మాట్లాడుతూ ,32 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ద్వారా ఎస్సీ వర్గీకరణ సాధించాం ,మాదిగ విద్యార్థులు ఎస్సీ వర్గీకరణ ఫలాలు వినియోగించుకోవాలి, విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా ఉన్నత విద్య అభ్యసించాలని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా జనాభా కలిగిన మాదిగలు విద్య ఉద్యోగ ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారు. వర్గీకరణ ద్వారా మన వాట సాధించుకున్నం విద్యారంగంలో ముందుకెళ్తే భవిష్యత్తు ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చు, భవిష్యత్తులో రాజకీయ రంగంలో కూడా ముందుకు సాగాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని అన్నాడు. జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని మాదిగ పల్లెల్లో ఆత్మగౌరవ జెండా ఎగురవేస్తూ పండగ చేసుకోవాలని అలాగే ఎమ్మార్పీ ఉద్యమంలో యువత భాగస్వాములు అయి జాతి భవిష్యత్తు నిర్మాణానికి ముందుకు సాగాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలోగంధగల్ల వీరయ్య మాదిగ, దేవులపల్లి మహేష్ ,మాణిక్యం,నరేందర్ గంగారం,నరేష్ మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.



# బద్ధకాన్ని బద్దలు చేసే యోగాసానాలు

చాలా మందికి నిద్ర లేవగానే మత్తుగా, బద్ధకంగా ఉంటుంది. ఏ పనీ చేయబుద్ది కాదు. మంచంపైనే అలా పడుకుని ఉండాలనిపిస్తుంది. శరీరవంలో శక్తే లేనట్లు నీరసంగా కూడా అనిపిస్తుంది. సరిపడా నిద్ర పోయినప్పుడు కూడా ఒక్కోసారి ఇలా అనిపిస్తుంది. గాఢ నిద్ర పోయిన సందర్భాల్లో కూడా ఈ ఫీలింగ్‌స్‌ను మనం చూస్తుంటాం. కానీ ఇది తరచూ ఉంటుంటే మాత్రం మంచిది కాదు. ఇలాంటి సమస్యను అధిగమించి ఉదయాన్నే నిద్ర లేచిన సమయంలో కూడా ఎనర్జిటిక్‌గా ఉండాలంటే సింపుల్ యోగాసానాలు కొన్ని వేస్తే సరిపోతుందని యోగి గురువులు చెప్తున్నారు. ఈ ఆసనాలను తరచూ వేయడం ద్వారా శరీరం చాలా ఎనర్జిటిక్‌గా మారుతుందని, అనేక ఆరోగ్య సమస్యలకు కూడా దరిచేరవని చెప్తున్నారు. మరి ఆ ఆసనాలేంటో ఒకసారి చూద్దామా..

## బాలాసనం:



ఈ ఆసనం ద్వారా లెక్కలేనన్న ప్రయోజనాలు ఉన్నాయి. ఈ ఆసనం కూడా ఆందోళనను తగ్గించి మనశ్శాంతిని పెంచుతుంది. ఈ ఆసనం వేయడం ద్వారా వెన్ను, ఛాతి, భుజాలు రిలాక్స్ అవుతాయి. నీరసం, సత్తవ లేనట్లు ఉండే భావనలు తొలగుతాయి. శక్తి పెరిగిన భావన కలుగుతుంది. ఈ ఆసనం వేయడానికి ఒక చోటు మోకాళ్లపై కూర్చోవాలి. అనంతరం శరీరాన్ని వంచి మోచేతులతో నేలను తాకాలి. అతి ఒక 30 క్షణాలు ఉన్న తర్వాత మెల్లిగా సాధారణ స్థితిక చేరుకోవాలి. ఇలా రోజూ కనీసం 20 సార్లు చేస్తే అద్భుతమైన మార్పును గమనించొచ్చు. పిల్లలు బోర్లా పడుకున్న భంగిమలో ఈ ఆసనం ఉంటుంది. అందుకే దీనికి బాలాసనం అని పేరు వచ్చిందని కొందరు చెప్తుంటారు.

## ధనురాసనం:



ఈ ఆసనం వేయడానికి ముందుగా బోర్లా నేలపై పడుకోవాలి. అక్కడి నుంచి మన చేతులను వెనకకు పెట్టి మన పాదాలను అందుకోవాలి. ఈ ఆసనం వేసిన సమయంలో కాళ్లు, చేతుల కండరాలపై అధిక ఒత్తిడి ఉంటుంది. మన బరువు అంతా కూడా పొత్తికడుపుపై ఉంటుంది. దీని వల్ల మలబద్ధకం లాంటి కడుపు సమస్యలు తగ్గుతాయి. శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఎనర్జీ పెరుగుతుంది.

## గరుడాసనం:

ఈ ఆసనం వేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. అంతేకాకుండా ఆందోళన వంటి భావనలు తగ్గుతాయి. రిలాక్స్ అయిన భావన కలుగుతుంది. ఒక చోట నిలబడి కాళ్లు చేతులు మెలేసినట్లు ఉండే ఈ భంగిమ అనేక ప్రయోజనాలు కలిగిస్తుంది. మన శారీరక బ్యాలెన్స్‌ను పెంచుతుంది. శరీర వ్యర్థాలను సులభంగా బయటకు పంపేలా వరీరాన్ని ప్రేరేపిస్తుంది. శరీరంలో ఎనర్జీ స్థాయలను పెంచుతుంది. ఈ ఆసనం వల్ల శరీరంలో రక్తప్రసరణ మెరుగు పడి గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటుంది. అంతేకాకుండా మెడ, భుజాల నొప్పి సమస్యలను కూడా తగ్గిస్తుంది.

## వీరభద్రాసనం:



ఈ ఆసనం వేయడం కూడా శరీర అవయవాలన్నీ ఫ్రీ అవుతాయి. ఈ ఆసనం మన రక్తప్రసరణను మెరుగు పరుస్తుంది. ఆక్సిజన్ సరఫరాలు పెంచుతుంది. ఎర్జీని అధికం చేస్తుంది. భుజాల సామర్థ్యాన్ని, శరీర బ్యాలెన్స్‌ను పెంచుతుంది. ఈ ఆసనం వేయడానికి నిఠారుగా నిల్చోవాలి. ఒక కాలికి వెనకు తీసుకెళ్లాలి. పెద్ద అంగ వేస్తున్న క్రమంలో నిల్చుని. ముందు కాలును వంచాలి. ఆ భంగిమలో ఉండి.. చేతులను పైకి లేపి నమస్కారం పెడుతున్న భంగిమలో ఉంచాలి. అదే విధంగా కాళ్లను మార్చి మరోసారి చేయాలి. ఇలా రోజూ చేయడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

## త్రికోణాసనం:



ఈ ఆసనం వేయడానికి కాళ్లను దూరంగా పెట్టి నిల్చోవాలి. ఆ తర్వాత ఒక పక్కగా వంగి చేతి వేళ్లతో పాదాలను తాకాలి. అలానే ఉండి మరో చేతిని గాల్లోకి నిఠారుగా ఉంచి మన చూపును ఆకాశం వైపు ఉంచాలి. ఈ భంగిమనలో మన శరీరం ఒక త్రిభుజాకారంలా ఉంటుంది. అందుకే దీనిని త్రికోణాసనం అంటారు. ఈ ఆసనం మనల్ని ఉత్తేజపరుస్తుంది. మలబద్ధక సమస్యను తగ్గిస్తుంది. బద్ధకంగా, నీరసంగా ఉండే భావనను పటాపంచలు చేస్తుంది. మన బ్యాలెన్స్‌ను పెంచుతుంది. ఈ ఆసనాన్ని రెండు వైపులకు వేయాలని. దీని వల్ల బాడీ చాలా రిలాక్స్ అవుతుంది.

ఈ ప్రయత్నాలు చేసిన తర్వాత కూడా బద్ధకం, నీరసం, నిస్సత్తువ సమస్యలు తగ్గకుండా వైద్యులను ఆశ్రయించడం మేలని నిపుణులు చెప్తున్నారు. శరీరంలో ఏమైనా లోపాలు ఉండటం వల్ల కానీ, ఏమైనా ఆరోగ్య సంబంధిత సమస్యలు ఉన్నా కానీ ఈ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, వీటి విషయంలో అలసత్వం, నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# హైబీపీ రాకూడదంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్న వయసులోనే అనేక రకాల రుగ్మతలు వస్తున్నాయి. వాటిలో అధిక మందిని ఇబ్బంది పెడుతున్న సమస్య రక్తపోటు అని నిపుణులు అంటున్నారు. యువకుల్లో కూడా ఈ రక్తపోటు సమస్య అధికంగా ఉంటుందని, విద్యార్థి దశ నుంచే ఈ సమస్యలు మొదలవుతుందని వైద్యులు చెప్తున్నారు. బీపీనేగా అని కొట్టి పారేస్తే ఇది ప్రాణాంతక సమ్యగా మారొచ్చని, దీనిని గుర్తించినప్పటి నుంచి నియంత్రణకు చర్యలు చేపట్టడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అయితే బీపీ ఒక్కసారి వచ్చిందంటే అది నయం కాదు. దానిని నియంత్రణలో ఉంచుకోవడం ఒక్కటే మార్గం. ఏమాత్రం ఆవేశపడినా, ఆహారంలో ఒక్కసారిగా ఉప్పు, కారాలు పెరిగినా బీపీ పెరిగి తీవ్ర స్థాయిలో ఇబ్బంది పెడుతుంది. అంతేకాకుండా హైబీపీ సమస్య ఉంటే దాంతో పాటు మరికొన్ని దీర్ఘకాలిక వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉంది. గుండె సంబంధిత సమస్యలు, డయాబెటీస్, కంటి సమసయలు వంటి వాటికి కూడా హైబీపీ కారణం కావొచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా హైబీపీ సమస్య రాకుండా ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం అని వైద్యులు సూచిస్తున్నారు. మన జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా హైబీపీని రాకుండా చేయడమే కాకుండా.. వచ్చినా కూడా నియంత్రించడం సులభతరం అవుతుందని వైద్యులు అంటున్నారు.



## బరువు:

హైబీపీని కంట్రోల్ చేయాలంటే ముందుగా మన బరువును కంట్రోల్ చేయాలని నిపుణులు చెప్తున్నారు. ఊబకాయం ఉంటే హైబీపీ వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుంది. నరాలపై ఒత్తిడి పెరడం వల్ల హైబీపీ వస్తుంది. అందుకే హైబీపీ సమస్య రాకూడదంటే ముందుగా మనం మన బరువును నియంత్రణలో ఉంచుకోవాలి. మన ఎత్తును బట్టి బరువును మెయింటెయిన్ చేయాలి. అధిక బరువు ఉండకుండా చూసుకోవాలి. వ్యాయామాలు చేయడంతో పాటు శరీరానికి కావాల్సిన పోషకాలు అందే ఆహారాన్ని తీసుకోవాలి.

## ఉప్పు, కారాలు తగ్గించాలి:

హైబీపీ రాకూడదన్నా, వచ్చిన రక్తపోటు నియంత్రణలో ఉండాలన్నా నోటిని కాస్తంత అదుపులో పెట్టుకోవాలని నిపుణులు చెప్తున్నారు. ఆహారంలో ఉప్పు, కారాలతో పాటు రక్తపోటుకు ధాతువులుగా పనిచేసే వాటిని గణనీయంగా తగ్గించుకోవాలి. ఉప్పు ఎక్కువగా ఉండే ప్రాసెస్డ్, ప్యాక్‌డ్ ఫుడ్‌ను దూరం పెట్టాలి.

## ధూమపానం, మద్యపానం నోనో:

పొగతాగడం, మద్యం సేవించడం సాధారణంగానే మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు చూపుతాయి. ఇవి తీసుకుంటే మన రక్తపోటులో హెచ్చుతగ్గులు వస్తాయి. కాబట్టి ఈ అలవాట్లకు దూరంగా ఉండాలి. ఇవి అలవాటు అయిపోయి ఉంటే మానేయడానికి ప్రయత్నించాలి. కుదిరితే సిగరెట్లు, బీడీలు తాగడం, మద్యం సేవించడం, పొగాకు ఉత్పత్తులు వాడడం పూర్తిగా మానేయాలి.

## వ్యాయామం తప్పనిసరి:

తరచూ వ్యాయామం చేసే వారికి వ్యాధులు వచ్చే అవకాశాలు చాలా స్వల్పంగా ఉంటాయి. అంతేకాకుండా వ్యాయామం చేయడం వల్ల మన రక్తపోటు కంట్రోల్‌లో ఉంటుంది. వరీమంతా రక్తసరఫరా సాఫీగా జరుగుతుంది. హైబీపీ తగ్గుతుంది. పూర్తి ఆరోగ్యానికి కూడా వ్యాయామం చాలా మేలు చేస్తుంది. వారంలో కనీసం 150 నిమిషాల పాటు అయినా వ్యాయామాలు చేయాలి. వేగంగా నడవడం, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి వాటిని చేయడం కూడా చాలా మంచిది

## ఒత్తిడి వద్దు:

వీటితో పాటుగా అధికంగా ఒత్తిడికి గురికాకుండా కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒత్తిడి పెరిగిందంటే దాంతో పాటే మన రక్తపోటు కూడా పెరుగుతూ పోతుంది. ఇదే ఒత్తిడి ఎక్కువ కాలం కొనసాగితే హైబీపీ వస్తుంది. అందుకే హైబీపీ రిస్క్‌ను తగ్గించుకోవడం కోసం రోజువారీ జీవితంలో ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. డీప్ బ్రీత్ వ్యాయామం చేయాలి. దేని వల్ల మనపై ఒత్తిడి పెరుగుతుందో గుర్తించి దానిని తగ్గించుకోవాలి. స్ట్రెస్ రిలీఫ్ పనులు చేయాలి.

**డైట్:** హైబీపీ రాకూడదంటే మన డైట్‌ను మెయింటెయిన్ చేయడం కూడా చాలా ముఖ్యం. బీపీ రాకుండా చేసే డైట్‌ను డయాష్ అంటారు. ఇందులో పండ్లు, కూరగాయాలు, తృణధాన్యాలు, ప్రొటీన్, కొవ్వు తక్కువగా ఉండే పాల ఉత్పత్తులు కచ్చితంగా తినాలని ఉంటుంది. సోడియం, సాచురేటెడ్ ఫ్యాట్, కొలెస్ట్రాల్ తక్కువగా ఉండే ఆహార పదార్థాలను ఈ డైట్‌లో తీసుకోవాలి. ఈ డైట్ పాటించడం ద్వారా హైబీపీ బాగా తగ్గుతుంది.

# ఆహారం తగ్గితే ఆరోగ్యం పెరుగుతుందా?

ఈ మధ్య చాలా కామన్ గా వింటున్నాం అందరూ అడపాదడపా ఉపవాసం చేస్తున్నామని, ఇది ఒక ట్రెండ్ మాత్రమే కాదు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది శాస్త్రీయంగా రుజువైన పద్ధతి. ముఖ్యంగా ఒబేసిటీ ఉన్నవాళ్ళకి మెటబాలిజాన్ని మెరుగుపరచడం ద్వారా మరియు క్యాలరీ తగ్గింపుతో బరువు తగ్గడంలో మెటబాలిజాన్ని మెరుగుపరచడం ద్వారా మరియు క్యాలరీ తగ్గింపుతో బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఇది రక్తపోటు కొలెస్ట్రాల్ మరియు ఇన్ఫ్లమేషన్ ని తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.



ఆరోగ్య నిపుణుల సలహా ఏమిటంటే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అందరికీ ఒకే విధంగా ఉండదు మీకు డయాబెటిస్ లాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నట్టయితే ప్రారంభించడానికి ముందు మీ పర్సనల్ ఫిజిషియన్ ని సంప్రదించండి. మీ ఆరోగ్యము జీవనశైలికి అనుగుణంగా ఫాస్టింగ్ విధానాన్ని రూపొందించుకోవాలి. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది సాంప్రదాయ జ్ఞానం మరియు ఆధునిక శాస్త్రాల మిశ్రమం. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ ఏ వయసులో అయినా చేయవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

భారతీయ సంస్కృతిలో ఉపవాసాలు చాలా కామన్. మతపరమైన ఉపవాసాలతో పోల్చినట్లయితే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ భోజన సమయంపై దృష్టి పెడుతుంది. కానీ భోజనాన్ని స్కిప్ చేయడం కాదు చాలా మందిలో అపోహలు ఉన్నాయి. ఈ ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ ఆకలిని పెంచుతుంది శారీరకంగా బలహీనతను కలిగిస్తుంది అని, కానీ చాలా అధ్యయనాల్లో తేలింది ఏంటంటే ఇది నిజం కాదు. సరిగ్గా అమలు చేసినట్టయితే ఇది చాలా సురక్షితం.

